థ్యాంక్యూ సీఎం సార్

● స్టాలిన్‌కు ధన్యవాదాలు తెలిపిన పర్యావరణ నిపుణులు


సీఎంతో పర్యావరణ నిపుణులు

అడయార్, మార్చి 2: తూత్తుకుడి జిల్లాలోని స్టెరిలైట్ కర్మాగారాన్ని శాశ్వతంగా మూసివేసేందుకు వీలుగా కఠిన చట్టాన్ని తీసుకుని రావడంతో పాటు కోర్టులో జరిగిన న్యాయపోరాటంలో ప్రభుత్వం తరఫున బలమైనవాదనలు వినిపించినందుకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు పర్యావరణ నిపుణులు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ఆళ్వార్‌పేటలోని సీఎం క్యాంపు కార్యాలయంలో శనివారం సీఎం స్టాలిన్‌ను కలుసుకున్న వారిలో పర్యావరణ పరిరక్షణ నిపుణులైన సుందరరాజన్, ప్రభాకరన్, వైద్య సెల్వన్, జియో టామిన్, స్టెరిలైట్ ఉద్యమ కమిటీకి చెందిన కృష్ణమూర్తి, ఫాతిమా బాబు, హరిరాఘవన్, మహేష్ కుమార్, మెరీనా బాబు, సుజిత్, గుణశీలన్, రీగన్, రాజా, కదిర్ మిస్ని, అజ్మిత్, వసంతి, సిమ్లా, గోపాల్, వాంజినాథన్, మారియమ్మాళ్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వారు సీఎంను అభినందించి, కృతజ్ఞతలు తెలిపారు. కాగా, గత 2018 మే నెల 22న స్టెరిలైట్ కర్మాగారానికి వ్యతిరేకంగా ఆందోళన చేసిన వారిపై పోలీసులు తుపాకీ కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో 13 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ మృతుల కుటుంబాలకు గత ప్రభుత్వం ఇచ్చిన ఎక్స్‌గ్రేషియాకు అదనంగా సీఎం స్టాలిన్ మరో రూ.5 లక్షలు చొప్పున అందించారు. అలాగే, గాయపడిన 17 కుటుంబాలకు చెందిన వారికి కారుణ్య నియామకం కింద వారివారి విద్యార్హలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలు కూడా కల్పించడంతో సీఎంకు మరోమారు అభినందనలు తెలిపారు. అలాగే, తనను కలిసిన పర్యావరణ నిపుణుల చేసిన విన్నపాల పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటానని వారికి ముఖ్యమంత్రి స్టాలిన్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కనిమొళి కూడా పాల్గొన్నారు.

● బెంగళూరు బాంబు పేలుడు వ్యవహారం

రాష్ట్రంలో పోలీసుల అప్రమత్తం


ప్రయాణికుల లగేజీని మెటల్ డిటెక్టర్లతో తనిఖీ చేస్తున్నరైల్వే పోలీసులు

చెన్నై, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరంలోని రామేశ్వరం కెఫే లో శుక్రవారం బాంబు పేలుడు ఘటనతో రాష్ట్ర పోలీసులు అప్రమత్తమయ్యారు. ప్రజలు అధికంగా గుమిగూడే ప్రాంతాలు, సమస్యాత్మక ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేస్తున్నారు. అంతేగాక ఎక్కడికక్కడ అనుమానితుల్ని అదుపులోకి తీసుకుని విచారించడంతో పాటు లోతుగా కూపీ లాగుతున్నారు. ముఖ్యంగా చెన్నైలో శుక్రవారం రాత్రి నుంచే వాహనాల తనిఖీలు తీవ్రతరం చేశారు. లాడ్జీలు, మేన్షన్లలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా ఎవరైనా ఉన్నారా? చట్టవ్యతిరేక చర్యలకు ఎవరైనా సహకరిస్తున్నారా? అనే విషయాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. నగరం, శివారు ప్రాంతాల్లో ఉంటున్న పొరుగు రాష్ట్రాల వ్యక్తుల గురించి కూడా ఆరా తీస్తున్నారు. స్థానిక ఎగ్మూర్, ట్రిప్లికేన్, ఈసీఆర్ ప్రాంతాల్లోని రిసార్టులు, లాడ్జీల్లో తనిఖీలు చేపట్టిన పోలీసులు, అక్కడ బసచేసిన వారి వివరాలు సేకరించడంతో పాటు వారిని విచారిస్తున్నారు. పార్లమెంటు ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో, బెంగళూరు బాంబు పేలుడు వంటి ఘటనలు దక్షిణాది రాష్ట్రాల్లో జరిగే అవకాశాలున్నాయని కేంద్ర హోంశాఖ ప్రకటించింది. ఆ ప్రకారం, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో అవసరమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర శాంతి భద్రతల విభాగం ఉన్నతాధికారులు తెలిపారు. అలాగే, ప్రధాన నగరాల్లో బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, మార్కెట్ ప్రాంతాల్లో పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. రైల్వేస్టేషన్లలో ప్రయాణికుల లగేజీని మెటల్ డిటెక్టర్ల ద్వారా తనిఖీ చేసిన తర్వాతే లోనికి అనుమతిస్తున్నారు. ఇక, రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లోని చెక్‌పోస్టుల్లో కూడా పోలీసులు వాహనతనిఖీలు తీవ్రతరం చేశారు. తీర ప్రాంతాలు, హార్బర్లలో కూడా తీరప్రాంత భద్రతా దళం పోలీసులు గస్తీ పనులు చేపట్టారు.

లోక్‌సభ ఎన్నికలతో పాటే విలవంగోడు ఉపఎన్నిక

● ఎన్నికల ప్రధానాధికారి సత్యప్రదసాహు



సైక్లింగ్ పోటీలు ప్రారంభిస్తున్న రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సత్యప్రదసాహు

పెరంబూర్, మార్చి 2: లోక్‌సభ ఎన్నికలతో పాటే విలవంగోడు శాసనసభకు కూడా ఉపఎన్నిక జరుపుతామని దీనిపై కేంద్ర ఎన్నికల కమిషన్ తగిన నిర్ణయం తీసుకుంటుందని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సత్యప్రదసాహు పేర్కొన్నారు. వందశాతం పోలింగ్ నమోదయ్యేందుకు చర్యలు చేపట్టిన ఎన్నికల కమిషన్ ఓటు హక్కు వినియోగంపై శనివారం అవగాహన ప్రచారం చేపట్టింది. ఇందులో భాగంగా మెరీనా బీచ్ నుంచి పల్లావరం వరకు ఓటు హక్కు ప్రాధాన్యం తెలిపేలా శనివారం ఉదయం సైకిల్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సత్యప్రదసాహూ, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ కమిషనర్ డా.జె.రాధాకృష్ణన్, నగర పోలీస్ కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రధానాధికారి సత్యప్రదసాహూ విలేకరులతో మాట్లాడుతూ... ప్రజలకు ఓటు హక్కు విలువ తెలిసేలా చేపట్టిన చర్యల్లో భాగంగా సైకిల్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో నమోదవుతున్న 70 శాతం పోలింగ్‌ను పెంచేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. తిరుక్కోవిలూర్ శాసనసభ నియోజకవర్గం ఖాళీగా వున్నట్లు ఎలాంటి లేఖ రాలేదన్నారు. లోక్‌సభ ఎన్నికలతో పాటు విలవంగోడు శాసనసభ ఉపఎన్నిక నిర్వహించడంపై కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. కాగా, విలవంగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే విజయధరణి ఇటీవల ఆ పార్టీ నుంచి వైదొలిగి బీజేపీలో చేరిన విషయం విదితమే. ఆమె తన ఎమ్మెల్యే పదవికి రాజానామా చేస్తూ అసెంబ్లీ స్పీకర్ అప్పావుకు లేఖ రాశారు. ఆమె లేఖ ఆమోదించినట్లు స్పీకర్ అప్పావు ప్రకటించగా, విలవంగోడు శాసనసభ నియోజకవర్గం ఖాళీగా ఉన్నట్లు శాసనసభ కార్యదర్శి ఎన్నికల కమిషన్‌కు లేఖ రాశారు. అదే సమయంలో మాజీ మంత్రి పొన్ముడి విజయం సాధించిన తిరుక్కోవిలూర్ శాసనసభ నియోజకవర్గంపై స్పీకర్ ఇంతవరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

ఏడు సీట్లు ఇవ్వండి

అన్నాడీఎంకేకు తెల్చిచెప్పిన డీఎండీకే ● ముగిసిన ఇరుపార్టీల రెండో విడత చర్చలు


సీట్ల సర్దుబాట్లపై అన్నాడీఎంకే సీనియర్లతో మాట్లాడుతున్న డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత

చెన్నై, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే కూటమిలో చేరాలంటే తమకు ఏడు లోక్‌సభ స్థానాలు కేటాయించాలని డీఎండీకే తేల్చి చెప్పింది. రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడక ముందే ప్రధాన పార్టీలు మిత్రపక్షాలకు సీట్ల కేటాయింపులను ఖరారు చేసే పనుల్లో నిమగ్నమయ్యాయి. బీజేపీ కూటమి నుంచి వైదొలగిన అన్నాడీఎంకే లోక్‌సభ ఎన్నికల్లో మెగా కూటమిని ఏర్పాటు చేసే దిశగా కొత్త పార్టీల కోసం పావులు కదుపుతోంది. పీఎంకే, డీఎండీకేలతో కలిసి ఎన్నికల బరిలోకి దిగితే గెలుపు సునాయాసమవుతుందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి భావిస్తున్నారు. ఈ దిశగానే పీఎంకే, డీఎండీకే నేతలతో అన్నాడీఎంకే సీనియర్ నేతలు చర్చలు జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో తొలిసారిగా అన్నాడీఎంకే సీనియర్ నేతలు డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలతతో మరోమారు భేటీ అయ్యారు. శుక్రవారం సాయంత్రం స్థానిక వలసర వాక్కంలోని ప్రేమలత ఇంటికి అన్నాడీఎంకే మాజీ మంత్రులు ఎస్పీ వేలుమణి, తంగమణి, కేపీ అన్బళగన్, బెంజమిన్ వెళ్లారు. కెప్టెన్ విజయకాంత్ చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు. ఆ తర్వాత ప్రేమలతను సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఆ సందర్భంగా సీట్ల సర్దుబాట్లకు సంబంధించి చర్చించారు. ప్రేమలతతో పాటు ఆ పార్టీ డిప్యూటీ కార్యదర్శి పి.పార్థసారథి ఈ చర్చల్లో పాల్గొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో 14 లోక్‌సభ స్థానాలు, ఒక రాజ్యసభ స్థానం ఇచ్చే పార్టీతోనే పొత్తు పెట్టుకుంటామని ప్రేమలత గతంలో ప్రకటించారు. శుక్రవారం జరిగిన రెండో విడత చర్చల్లో అన్నాడీఎంకే కూటమిలో ఓటు బ్యాంక్ అధికంగా ఉన్న పీఎంకే కూడా చేరనుండటంతో ఆ పార్టీకి తగినన్ని సీట్లు కేటాయించాల్సి ఉందని, అందువల్ల 14 సీట్లను కేటాయించలేమని మాజీ మంత్రులు వేలుమణి, తంగమణి పేర్కొన్నారు. దీంతో పట్టుసడలించిన ప్రేమలత ఏడు లోక్‌సభ నియోజకవర్గాలు, రాజ్యసభ సీటును కేటాయించాలని కోరారు. ఈ విషయమై పార్టీ నేత ఈపీఎస్‌తో మాట్లాడాక స్పష్టత ఇస్తామని వేలుమణి పేర్కొన్నట్లు తెలిసింది. ఆ తర్వాత అన్నాడీఎంకే సీనియర్ నేతలు విలేకరులతో మాట్లాడుతూ... డీఎండీకేతో జరిపిన చర్చలు సంతృప్తికరంగా ముగిశాయన్నారు. మలి విడత చర్చల్లో సీట్ల సర్దుబాట్లు ఖరారవుతాయని తెలిపారు. ఇదిలా ఉండగా సీట్ల సర్దుబాట్లపై అన్నాడీఎంకే అధిష్ఠానంతో చర్చలు జరిపేందుకు డీఎండీకే ఐదుగురు సభ్యులతో ఓ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రేమలత ప్రకటించారు. డీఎండీకే ఏడు సీట్లడుగుతున్నా అన్నాడీఎంకే అధిష్ఠానం ఐదు సీట్లను ఒక రాజ్యసభ సీటను మాత్రమే కేటాయించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. అయితే మలివిడత చర్చల్లో ఆ సీట్ల సంఖ్య ఆరుకు చేరుకునే అవకాశం ఉందని అన్నాడీఎంకే సీనియర్ నాయకులు చెబుతున్నారు.

అన్నాడీఎంకే, డీఎంకేలకు మా పార్టీ తలుపులు తెరిచే ఉంచాం


కేంద్రమంత్రి వీకే సింగ్

చెన్నై, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే, డీఎంకేలను తమ కూటమిలో చేర్చుకునేందుకు సిద్ధమేనని కేంద్ర మంత్రి వీకే సింగ్ అన్నారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం కన్నియాకుమారి జిల్లాకు విచ్చేసిన ఆయన శనివారం ఉద యం పార్టీ జిల్లా నేతల సమావేశంలో పాల్గొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. ఆ తర్వాత విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కన్నియాకుమారి వద్ద విమానాశ్రయం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. విమానాశ్రయానికి అనువైన స్థలాన్ని ఎంపిక చేసి రాష్ట్రప్రభుత్వం అందజేస్తే వీలైనంత త్వరగా నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. ప్రజా సంక్షేమం దృష్ట్యా అన్నాడీఎంకే, డీఎంకే తమ కూటమిలోకి వస్తే చేర్చుకునేందుకు బీజేపీ సిద్ధంగా ఉందని తెలిపారు. కన్నియాకుమారిలో బీజేపీ తరఫున పోటీ చేయనున్న అభ్యర్థిని పార్టీ అధిష్ఠానమే ప్రకటిస్తుందని చెప్పారు. ప్రధాని మోదీ మొహంలో ఓటమి భయం కనిపిస్తోందంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. మూడోసారి ముచ్చటగా మునుపటి కంటే మరింత మెజారిటీతో మోదీని ప్రధాని పీఠంపై కూర్చోబెట్టేందుకు దేశ ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని వీకేసింగ్ చెప్పుకొచ్చారు.

చెన్నై - సేలం మధ్య సాయంత్ర వేళల్లో విమాన సర్వీసు


● హామీ ఇచ్చిన కేంద్రమంత్రి

అడయార్, మార్చి 2: చెన్నై - సేలం ప్రాంతాల మధ్య సాయంత్ర వేళలో డైరెక్టు విమాన సర్వీసును నడిపేందుకు కేంద్ర పౌర విమానయాన మంత్రి జ్యోతిరాదిత్య సింధియా సమ్మతించారు. ఈ మేరకు ఆయనక డీఎంకే ఎంపీ ఎస్ఆర్ పార్తిబన్‌కు హామీ ఇచ్చారు. సేలం కాలమలాపురం విమానాశ్రయం నుంచి చెన్నై, బెంగళూరు, కొచ్చిన్, హైదరాబాద్ లకు విమాన సర్వీసులు నడుపుతున్నారు. అయితే, ఇండిగో విమాన సంస్థ చెన్నై - సేలం మధ్య మధ్యాహ్నం పూట విమాన సర్వీసును నడుపుతోంది. ఈ విమాన చెన్నైలో మధ్యాహ్నం 11.20 గంటలకు బయలుదేరి 12.15 గంటలకు సేలంకు చేరుకుంటుంది. అలాగే, తిరుగు ప్రయాణంలో సేలంలో మధ్యాహ్నం 12.50 గంటలకు బయలుదేరి చెన్నైకు 1.15 గంటలకు చేరుకుంటుంది. అయితే, ఈ రెండు ప్రాంతాల మధ్య సాయంత్ర వేళలో విమాన సర్వీసును నడపాలని కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్యకు డీఎంకే ఎంపీ పార్తిబన్ వినతిపత్రం సమర్పించారు. ఈ వినతిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు.


చెన్నై టి.నగర్ జీఎన్ చెట్టిరోడ్డులో ఉన్న పద్మావతి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం కల్పవృక్ష వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

రాజీవ్ హత్య కేసు దోషుల్ని విదేశాలకు పంపాలి

● ఈపీఎస్ డిమాండ్



చెన్నై, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ హత్యకేసు ముద్దాయిలు మురుగన్ సహా ముగ్గురినీ వారు కోరుకున్న దేశాలకు పంపేలా తగు చర్యలు చేపట్టాలని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటనను జారీ చేశారు. రాజీవ్‌హత్య కేసులో 32 యేళ్లకు పైగా యావజ్జీవ కారాగార శిక్షను అనుభవించిన రాబర్ట్ పయాజ్, జయకుమార్, మురుగన్, శాంతన్ 2022 నవంబర్ 11న సుప్రీంకోర్టు తీర్పు మేరకు విడుదలయ్యారు. అయితే వీరంతా శ్రీలంకకు చెందిన వారు కావటంతో తిరుచ్చిలోని శ్రీలంక తమిళుల పునరావాస కేంద్రానికి తరలించారు. ఈ విషయాలను ఈపీఎస్ గుర్తు చేస్తూ శ్రీలంక తమిళుల పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందిన శ్రీలంకవాసులను అధికారులు స్వదేశం కాకుండా ఇతర దేశాలకు వెళ్లే ఆసక్తిని కనబరిస్తే ఆ దిశగా చర్యలు తీసుకుని పంపడం ఆనవాయితీ అని తెలిపారు. ఆ రీతిలోనే తిరుచ్చిలో ఉన్న రాబర్ట్ పయాజ్, మురుగన్, జయకుమార్‌ను వారి బంధువులున్న విదేశాలకు పంపేందుకు అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని ఈపీఎస్ కోరారు. రాజీవ్‌హత్య కేసులో మరో ముద్దాయి శాంతన్‌ను శ్రీలంకకు వెళ్లేందుకు కేంద్రప్రభుత్వం అనుమతి జారీ చేసినా అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని, ఈ పరిస్థితి తక్కిన ముగ్గురికి రాకూడదని పేర్కొన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి స్టాలిన్ జోక్యం చేసుకుని మురుగన్, రాబర్ట్ పయాజ్, జయకుమార్‌ను వారు కోరుకున్న దేశానికి పంపే ఏర్పాట్లు చేపట్టాలని ఈపీఎస్ డిమాండ్ చేశారు.

అన్నాడీఎంకే దరఖాస్తుల గడువు పొడిగింపు

పెరంబూర్, మార్చి 2: రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ తరఫున పోటీ చేయాలనుకొనే ఆశావాహుల నుంచి దరఖాస్తు స్వీకరణ ఈనెల 6వ తేది వరకు పొడిగించినట్లు అన్నాడీంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ప్రకటించారు. పార్లమెంటు ఎన్నికల్లో డీఎంకే, బీజేపీకి వ్యతిరేకంగా అన్నాడీఎంకే నేతృత్వంలో కూటమి ఏర్పాటుకు ఆ పార్టీ పలు పార్టీలతో చర్చలు జరుపుతోంది. అదే సమయంలో తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లోని 40 నియోజకవర్గాల్లో పోటీ చేసేందుకు ఆసక్తి ఉన్న వారి దరఖాస్తుల సమర్పణ గత నెల 21వ తేది ప్రారంభం కాగా ఇప్పటివరకు సుమారు 1,000 మందికి పైగా దరఖాస్తులు అందించారు. మరో 1,500 దరఖాస్తులు విక్రయమయ్యాయి. దరఖాస్తుతో పాటు డిపాజిట్‌గా ఒకరికి రూ.20 వేలు చెల్లించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఈనెల 1వ తేది దరఖాస్తు సమర్పణకు చివరి తేది అని ప్రకటించిన నేపథ్యంలో, నాయకుల విజ్ఞప్తి మేరకు సమర్పణ గడువు 6వ తేది వరకు పొడిగించినట్లు ఈపీఎస్ తెలిపారు.

రాజీవ్ గాంధీ ఆసుపత్రిలో టోకెన్ మెషిన్

ఐసిఎఫ్, మార్చి 2: స్థానిక సెంట్రల్ సమీపంలోని రాజీవ్ గాంధీ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆటోమేటిక్ టోకెన్ మెషిన్లను ఏర్పాటు చేశారు. ఈ ఆసుపత్రికి ప్రతిరోజు 10,000 నుంచి 15,000 వరకు ఔట్ పేషంట్లు వచ్చి వెళుతుంటారు. వీరు టోకెన్లు పొందేందుకు క్యూలో వేచి ఉండాల్సి వస్తోంది. ఈ సమస్య పరిష్కరించేలా తొలివిడతగా ఆసుపత్రిలోని 15 విభాగాల్లో ఆటోమేటిక్ టోకెన్ మెషిన్లు ఏర్పాటు చేశామని, త్వరలో మిగిలిన విభాగాలకు విస్తరిస్తామని ఆసుపత్రి డీన్ తేరణిరాజన్ తెలిపారు.

ప్రభుత్వ కారు అప్పగింత

పుదుచ్చేరి, మార్చి 2: తనకు ఇచ్చిన కారును పుదుచ్చేరికి చెందిన భారతీయ జనతా పార్టీకి మద్దతు ఇస్తున్న ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అంకాలన్ ప్రభుత్వానికి అప్పగించారు. ఈ కారు పదేపదే మరమ్మతులకు గురవుతుండటంతో తనకు వద్దంటూ తిరిగి ఇచ్చేశారు. పుదుచ్చేరి తిరుభవనై నియోజకవర్గ ఎమ్మెల్యేగా అంకాలన్ గెలుపొందగా, ఈయన బీజేపీ మద్దతుదారుడు. ఈయనకు ప్రభుత్వం ఒక కారును ఇచ్చింది. అయితే, ఆ కారు నిత్యం మరమ్మతులకు గురవుతుంది. దీంతో తనకు కొత్తకారును కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరినప్పటికీ స్పందన లేదు. దీనికి నిరసనగా ఆయన తన కారును శుక్రవారం అసెంబ్లీకి తీసుకొచ్చి కారు తాళంను స్పీకర్ సెల్వంకు అందజేశారు.

మలేసియా నుంచి 6.5 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు



పెరంబూర్, మార్చి 2: వేసవిలో విద్యుత్ కోతలు అడ్డుకొనేలా మలేసియా నుంచి 6.5 లక్షల టన్నుల నేలబొగ్గు దిగుమతి చేసుకోవాలని తమిళనాడు విద్యుదుత్పత్తి, పంపిణీ సంస్థ నిర్ణయించింది. రాష్ట్రంలో క్రమేణా ఎండలు పెరుగుతుండడంతో విద్యుత్ వినియోగం కూడా అధికమైంది. ప్రస్తుతం రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో 4,320 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతుండగా, అందుకోసం రోజుకు 72 వేల మెట్రిక్ టన్నుల నేలబొగ్గు అవసరమవుతోంది. ఈ నేలబొగ్గు ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల నుంచి కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం వేసవిలో అధిక విద్యుత్ వినియోగం జరుగుతున్న నేపథ్యంలో, ఉత్పత్తికి చాలినంత నేలబొగ్గు దేశం నుంచి లభ్యం కావడం లేదు. దీంతో, 6 శాతం నేలబొగ్గును విదేశాల నుంచి దిగుమతి చేసుకొనేందుకు కేంద్రప్రభుత్వం అనుమతించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి మార్చి, ఏప్రిల్ నెలలకుగాను మలేసియా నుంచి 6.5 లక్షల టన్నుల నేలబొగ్గును దిగుమతి చేసుకోవాలని విద్యుత్ బోర్డు నిర్ణయించింది. తొలివిడతగా ఈ నెల మొదటి వారంలో 1.40 లక్షల టన్నుల నేలబొగ్గు దిగుమతి అవుతుందని అధికారులు తెలిపారు.

సమాచార ధ్వని

నేడు నుంగంబాక్కంలో ట్రాఫిక్ మార్పులు

ఐసిఎఫ్, మార్చి 2: మెట్రోరైలు పనుల కారణంగా స్థానిక అన్నా ఫ్లై ఓవర్, నుంగంబాక్కం స్టెర్లింగ్ రోడ్డులో ఆదివారం పోలీసులు ట్రాఫిక్ మార్పులు ప్రకటించారు. చెట్‌పెట్ నుంచి జెమిని ఫ్లై ఓవర్ మీదుగా వచ్చే వాహనాలు కాలేజి రోడ్డు - హాడర్స్ రోడ్డు - ఉత్తమర్ గాంధీ రోడ్డు మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. ఈ మార్గం వన్‌వేగా చేశారు. జెమిని ఫ్లై ఓవర్ నుంచి వచ్చే వాహనాలు ఎంజీఆర్ రోడ్డు - వళ్లువర్‌కోట్టం మీదుగా వెళ్లాలి. అమింజికర్రై మీదుగా వెళ్లే వాహనాలు టాంక్ బండ్ రోడ్డులో ఎడమవైపు తిరిగి నెల్సన్ మాణిక్యం రోడ్డు మీదుగా అమింజికర్రై, ఇతర ప్రాంతాలకు చేరుకోవాలి. వళ్లువర్‌కోట్టం నుంచి జెమిని ఫ్లై ఓవర్ వెళ్లే వాహనాలు వళ్లువర్ కోట్టం హైరోడ్డు - ఉత్తమర్ గాంధీ రోడ్డు మీదుగా వెళ్లాలి. ఇతర అంతర్ రోడ్లు వన్‌వేగా ఉంటాయని పోలీసులు తెలిపారు.

ఆవిన్ ఐస్‌క్రీం ధరల పెంపు

పెరంబూర్, మార్చి 2: ఆవిన్ ఐస్‌క్రీం ధర పెంపు ఈనెల 3న ఆదివారం నుంచి అమల్లోకి రానుంది. రాష్ట్ర ప్రభుత్వ అధీనంలోని ఆవిన్ సంస్థ పాలతో పాటు నెయ్యి, పెరుగు, బాదం పాలు, కుల్ఫీ, పాలపౌడర్, ఐస్‌క్రీం సహా పలు పాల ఉత్పత్తులు తయారీ చేసి విక్రయిస్తోంది. ఈ నేపథ్యంలో, ఆవిన్ ఐస్‌క్రీం ధరలు రూ.2 నుంచి రూ.5 వరకు పెరిగాయి. 65 మి.లీ చాకో బార్ రూ.20 నుంచి రూ.25, 125 మి.లీ వెనిల్లా రూ.28 నుంచి రూ.30, 100 మి.లీ క్లాసిక్ కోన్ వెనిల్లా, క్లాసిక్ కోన్ చాక్లెట్ రూ.30 నుంచి రూ.35కు పెరిగాయి.

నేడు 44 సబర్బన్ రైళ్ల రద్దు

పెరంబూర్, మార్చి 2: స్థానిక కోడంబాక్కం - తాంబరం మధ్య చేపట్టనున్న మరమ్మతుల కారణంగా ఆదివారం చెన్నై బీచ్ నుంచి ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు తాంబరం వెళ్లే సబర్బన్ రైళ్లు పూర్తిగా రద్దు చేశారు. అలాగే, తాంబరం నుంచి ఉదయం 10.05 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు చెన్నై బీచ్‌కు వెళ్లే సబర్బన్ రైళ్లు రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

ఏడు నిమిషాలకు ఒక మెట్రో...

ప్రయాణికుల సౌకార్యార్థం ఆదివారం 7 నిమిషాలకు ఒక మెట్రోరైలు నడపనున్నట్లు సీఎంఆర్ఎల్ తెలియజేసింది. మరమ్మతుల కారణంగా చెన్నై బీచ్ - తాంబరం మధ్య ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు సబర్బన్ రైళ్లు రద్దు చే యడంతో ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు 7 నిమిషాలకు ఒక మెట్రోరైలు నడపనున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే, తాంబరం నుంచి చెన్నై బీచ్ వరకు అదనంగా 150 ఎంటీసీ బస్సు సేవలు అందుబాటులో ఉంటాయని మెట్రో ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ పేర్కొంది.

నేడు పల్స్ పోలియో

పెరంబూర్, మార్చి 2: రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం పోలియో చుక్కల శిబిరాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వం విడుదల చేసిన ప్రకటనలో... ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వాసుపత్రులు, అంగన్వాడీ కేంద్రాలు, పౌష్టికాహార కేంద్రాలు, పాఠశాలు, ప్రధాన ప్రాంతాలు అని మొత్తం 43,051 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో ఐదేళ్లలోపున్న చిన్నారులను పోలియో చుక్కలు వేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

కేంద్రప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, మార్చి 2: కేంద్రప్రభుత్వ వివిధ మంత్రిత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ఉద్యోగాల ఎంపిక కమిషన్ నోటిఫికేషన్ గత నెల 26వ తేది విడుదల చేసింది. పోస్టుల సంఖ్య, విద్యార్హతలు, రుసుము, రాత పరీక్షా వివరాలతో పాటు దరఖాస్తులను http://ssc.gov.in లో మాత్రమే పంపాలి. దరఖాస్తు సమర్పణకు ఈనెల 18వ తేది ఆఖరు. కాగా, ఆన్‌లైన్ ద్వారా రుసుము చెల్లింపునకు 19వ తేది చివరి రోజు. దక్షిణాది రాష్ట్రాల్లో మే 6 నుంచి 8వ తేది వరకు ఆన్‌లైన్ ద్వారా పరీక్ష నిర్వహించనుండగా, రాష్ట్రంలో 8 కేంద్రాలు ఏర్పాటయ్యాయి.

రేపు బీజేపీ రాష్ట్ర కేంద్ర కమిటీ సమావేశం

పెరంబూర్, మార్చి 2: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై నేతృత్వంలో ఈనెల 4వ తేది ఆ పార్టీ రాష్ట్ర కేంద్ర కమిటీ సమావేశం జరగనుంది. చెన్నైలోని బీజేపీ కార్యాలయం కమలాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరగనున్న సమావేశంలో పార్టీ ఇన్‌చార్జి అరవింద్ మేనన్ పాల్గొంటారు. లోక్‌సభ ఎన్నికల కార్యాచరణ, ప్రచార వ్యూహం, పొత్తులు తదితరాలపై చర్చించనున్నారు.

తూత్తుకుడి రైలుకు ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు

ఐసిఎఫ్, మార్చి 2: తూత్తుకుడి రైలుకు ఎల్‌హెచ్‌బీ(లింకే హాఫ్‌మ్యాన్ బుష్) కోచ్‌లు అనుసంధానం చేయనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది. ఎక్స్‌ప్రెస్ రైళ్లలో పాత పెట్టెలు తొలగించి ఎల్‌హెచ్‌బీ బోగీలు అనుసంధానం చేస్తున్నారు. ఈ కోచ్‌లు త్వరగా నిప్పంటుకోవు, కుదుపులు లేకుండా సురక్షితంగా, వేగంగా వెళ్లేలా రూపొందించారు. సౌకర్యవంతమైన సీట్లు, మొబైల్ ఫోన్ చార్జింగ్ వంటి సదుపాయాలు కల్పించారు. ఎల్‌హెచ్‌బీ సాధారణ కోచ్‌లల్లో 80, ఏసీ కోచ్‌ల్లో 72 సీట్లుంటాయి. తూత్తుకుడి-గుజరాత్ రాష్ట్రం ఓఖా మధ్య నడిచే సూపర్‌ఫాస్ట్ రైలుకు ఆదివారం నుంచి ఈ బోగీలు అనుసంధానం చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రతిరోజు నవగ్రహ పర్యాటక బస్సు

ఐసిఎఫ్, మార్చి 2: కుంభకోణం చుట్టుపక్కల ఉన్న నవగ్రహ క్షేత్రాలకు ఏప్రిల్ 1వ తేది నుంచి ప్రతిరోజు పర్యాటక బస్సులు నడపనున్నట్లు రవాణా శాఖ అధికారులు తెలిపారు. ఈ ఆలయాలకు ఒకేరోజులో ఒకే బస్సులో ప్రయాణించేలా నవగ్రహ ప్రత్యేక బస్సులు గత నెల 24వ తేది ప్రారంభించారు. శని, ఆదివారాల్లో ఈ బస్సులను కుంభకోణం రవాణా సంస్థ నడుపుతోంది. తింగలూరు చంద్రన్ ఆలయం, ఆలంగుడి గురుభగవాన్, తిరునాగేశ్వరం రాహు భగవాన్, సూర్యనార్ ఆలయ సూర్యభగవాన్, కంజనూరు శుక్రన్ ఆలయం, వైదీశ్వరన్ ఆలయం, తిరువేంకాడు పెరుంపల్లం కేతుభగవాన్ దర్శనం, తిరునల్లారు శనిభగవాన్ ఆలయాల దర్శనాలతో ఈ యాత్ర పూర్తవుతుంది. ఒకరికి రూ.750 ఛార్జీ నిర్ణయించారు. ఈ ఆధ్యాత్మిక యాత్రకు స్పందన రావడంతో, ఏప్రిల్ 1వ తేది నుంచి ప్రతిరోజు నవగ్రహ ప్రత్యేక బస్సులు నడపనున్నామని, tnstc అనే యాప్, www.tnstc.in వెబ్‌సైట్ ద్వారా టిక్కెట్లు బుకింగ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.

నేడు శివరాత్రి సంగీత మహోత్సవం

ఐసిఎఫ్, మార్చి 2: శ్రీ కళాసుధ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో శివరాత్రి సంగీత మహోత్సవాలు జరగనున్నాయి. టి.నగర్ బజుల్లా రోడ్డు సమీపంలోని బీబీసీ ఆర్చిడ్ కోర్టులో ఉన్న ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు ఘంటసాల సావిత్రి శివకుమార్ ప్రార్థనాగీతంతో కార్యక్రమం ప్రారంభమవుతుంది. ముఖ్యఅతిథిగా ఆదిత్యరాం గ్రూప్ ఛైర్మెన్ ఆదిత్యరామ్, విశిష్టఅతిథులుగా సినీనిర్మాత ఏఎం రత్నం, వీజీఎన్ హోమ్స్ డైరెక్టర్ పద్మా దేవదాస్, నేపథ్య గాయకులు ఉన్నికృష్ణన్, శ్రీనివాస్ తదితరులు హాజరుకానున్నారు. 'వేణుగాన సమ్మోహనం' పేరుతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

వీఐటీలో కోలాహలంగా రివేరా కల్చరల్ ఫెస్ట్

వేలూరు, మార్చి 2: వీఐటీ యూనివర్శిటీలో నిర్వహిస్తున్న 'రివేరా-24' కల్చరల్ వేడుకలు కోలాహలంగా సాగుతున్నాయి. గత నెల 29న ప్రారంభమైన ఈ వేడుకలు ఆదివారంతో ముగియనున్నాయి. మొదటి, రెండో రోజు సినీ నేపథ్యగాయకుల సంగీత కచ్చేరి జరిగింది. శుక్రవారం రాత్రి 'ప్రేమ, సోదర భావం' అవగాహన కల్పించేలా ప్రత్యేక నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఆంధ్రా, అసోం, ఢిల్లీ, గోవా, గుజరాత్, కశ్మీర్, కర్ణాటక, కేరళ, తమిళనాడు సహా 24 రాష్ట్రాలకు చెందిన సుమారు 2,000 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాటలకు అనుగుణంగా స్టెప్పులేసి సందడి చేశారు. ఆదివారం సాయంత్రం 7 గంటలకు జరిగే వేడుకల ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సినీ నటి సమంత పాల్గొని, వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందించనున్నారు.



కల్చరల్ ఫెస్ట్‌లో నృత్య ప్రదర్శన

చిదంబరంలో వామపక్షాల రైలురోకో

● 100 మంది అరెస్టు

చెన్నై, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): చిదంబరం రైల్వేస్టేషన్ వద్ద రైలురోకో జరిపిన వామపక్షాలకు చెందిన వందమంది కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. మైలాడుదురై - మైసూరు సెంగోట్టై ఎక్స్‌ప్రెస్‌ను చిదంబరం మీదుగా కడలూరు వరకు పొడిగించాలని, విల్లుపురం - మైలాడుదురై రైలు మార్గాన్ని డబ్లింగ్ చేయాలని కోరుతూ సీపీఐ, సీపీఎం కార్యకర్తలు రైలు రోకోకు దిగారు. ఆ మార్గంలో వెళుతున్న ఓ రైలును ఆపేందుకు ప్రయత్నించారు. దీంతో రైల్వే పోలీసులు బలప్రయోగంతో వందమందిని అరెస్టు చేశారు. ఈ సంఘటన కారణంగా చిదంబరం రైల్వేస్టేషన్ అంతటా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.



కార్యకర్తలను అరెస్టు చేస్తున్న పోలీసులు

మాంజా దారంపై నిషేధం కొనసాగింపు

ఐసిఎఫ్, మార్చి 2: నగరంలో మాంజా దారం తయారీ, విక్రయాలపై ఇదివరకే అమలులో ఉన్న నిషేధాన్ని మరో రెండు నెలలు పొడిగిస్తూ చెన్నై పోలీసు శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గాలి పటాలు ఎగర వేసేందుకు మాంజా దారం వినియోగం, విక్రయాలపై ప్రభుత్వం నిషేధం విధించింది. ఫిబ్రవరి 29వ తేదీతో ముగిసిన ఈ గడువును ఏప్రిల్ 29వ తేది వరకు కొనసాగనుందని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు చేపడతామని పోలీసు అధికారులు హెచ్చరించారు.

అరక్కోణంలో రూ.15 కోట్లతో గూడ్స్ టెర్మినల్

ఐసిఎఫ్, మార్చి 2: అరక్కోణం రైల్వేస్టేషన్ సమీపంలో రూ.15 కోట్లతో గూడ్స్ రైళ్ల టెర్మినల్ ఏర్పాటు చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వ గతిశక్తి పథకం కింద రైల్వేలో వివిధ కొత్త పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారు. ఈ క్రమంలో, సరుకులను తరలించేలా రైల్వే షెడ్లు, టెర్మినల్ ఏర్పాటు వంటి పనులు చేపడుతున్నారు. అరక్కోణంలో రూ.15 కోట్లతో కొత్త టెర్మినల్‌ను ఏర్పాటు చేయనున్నట్లు చెన్నై రైల్వే డివిజన్ అధికారులు తెలిపారు.

త్వరలో సరుకుల రవాణా కౌన్సిల్ ఏర్పాటు

ఐసిఎఫ్, మార్చి 2: త్వరలో సరుకుల రవాణా కౌన్సిల్ ఏర్పాటుకు టిట్కో చర్యలు చేపట్టింది. రాష్ట్రంలో సరుకుల రవాణాకు సంబంధించిన శాఖలను సమన్వయపరిచే ఏజెన్సీగా తమిళనాడు వృత్తుల అభివృద్ధి సంస్థ పని చేస్తోంది. ప్రస్తుతం సరుకుల రవాణాలో తలెత్తిన సమస్యలను పరిష్కరించేందుకు లాజిస్టిక్ కౌన్సిల్ ఉండగా, అందులో హార్బర్, విమానం, నౌక, ఎగుమతి, దిగుమతుల శాఖలకు సంబంధించిన 31మంది సభ్యులున్నారు. టిట్కో ఎండీ ఆధ్వర్యంలో పనిచేసే ఈ కౌన్సిల్‌కు రాష్ట్రప్రభుత్వ అనుమతిని కోరింది.

కరుణానిధి మ్యూజియం కోసం ప్రత్యేక యాప్

ఐసిఎఫ్, మార్చి 2: దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి స్మారక స్థల మ్యూజియం సందర్శకుల కోసం మొబైల్ యాప్ రూపకల్పన పనులు ప్రజాపనుల శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. మెరీనా తీరంలో రూ.39 కోట్లతో స్మారక మండపం నిర్మించగా, అందులో 20 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో 15 అడుగుల లోతున సముద్రం తీరంలో 'కలైంజర్ ఉళగం' డిజిటల్ మ్యూజియం 3డీ సాంకేతిక పరిజ్ఞానంతో రెండు థియేటర్లతో ఏర్పాటు చేశారు. ఒకే సమయంలో కనిష్ఠంగా 150 నుంచి 200 మందిని మాత్రమే 2 గంటల పాటు అనుమతిస్తున్నారు.

గృహాలపై సోలార్ ప్యానెల్ ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవచ్చు

అడయార్, మార్చి 2: గృహాలపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు ఆసక్తి చూపేవారు దరఖాస్తు చేసుకోవచ్చని చెన్నై ప్రాంతీయ తంతి తపాలా ప్రధానాధికారి స్వాతి మధురిమ కోరారు. ప్యానెళ్ల ఏర్పాటు చేసుకుని విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకుని ఆ విద్యుత్‌ను గృహయజమానులే వినియోగించుకునేలా, ప్రతి నెలా 300 యూనిట్ల ఉచిత విద్యుత్ అందజేసే పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అలాగే, అదనపు విద్యుత్‌ను ఇతరులకు విక్రయించుకోవచ్చు. ఈ పథకంలో చేరదలచిన వారు తమతమ ఏరియాల్లోని పోస్టాఫీసుల్లో సంప్రదించాలని కేంద్రం ప్రకటించింది. అదేవిధంగా, ప్యానెళ్ల కోసం రిజిస్ట్రేషన్ పనులు ప్యారీస్‌లోని తంతి తపాలా శాఖలో ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నారు.

రామనాథపురంలో ముస్లింలీగ్ అభ్యర్థిగా నవాజ్‌ఘనీ

చెన్నై, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): డీఎంకే కూటమిలో ముస్లింలీగ్ పార్టీకి రామ నాథపురం లోక్‌సభ నియోజకవర్గాన్ని కేటాయించారు. ఆ నియోజకవర్గంలో ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ తరపున నవాజ్‌ఘనీ పోటీ చేస్తారని ఆ పార్టీ శనివారం అధికారికంగా ప్రకటించింది. తమ పార్టీ అభ్యర్థి నిచ్చెన గుర్తుపైనే పోటీ చేస్తారని పేర్కొంది. నగరంలో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు రామనాథపురం అభ్యర్థినవాజ్‌ఘనీని పరిచయం చేశారు. ఈఎన్నికల్లో నవాజ్‌ఘనీ ఘనవిజయం సాధిస్తారని పేర్కొన్నారు.



ఘనీని పరిచయం చేస్తున్న పార్టీ నాయకులు

ఎన్నికల తర్వాతే రాజకీయ ప్రవేశం

అడయార్, మార్చి 2: సార్వత్రిక ఎన్నికల తర్వాత తాను ఏ పార్టీలో చేరబోతున్నాననే విషయాన్ని వెల్లడిస్తానని ప్రముఖ సీనియర్ నటుడు సత్యరాజ్ కుమార్తె, న్యూట్రిషనిస్ట్ దివ్య సత్యరాజ్ తెలిపారు. తాను రాజకీయాల్లోకి రాబోతున్నట్టు సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం సాగుతోందన్నారు. తనకు పదవుల కోసమో, ఎన్నికల్లో గెలుపొందాలనే ఉద్దేశంతో రాజకీయాల్లోకి రావాలన్న ఆలోచన లేదన్నారు. ప్రజలకు ఏదో ఒక మంచి చేయాలనే రావాలని భావిస్తున్నట్టు చెప్పారు. ఇందుకోసం 'మగిళ్‌మతి ఇయ్యక్కం' అనే పేరుతో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నట్టు తెలిపారు. అయితే, వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలని ఏ ఒక్క పార్టీ నుంచి తనకు పిలుపు రాలేదన్నారు. అదేసమయంలో మతతత్వ పార్టీలతో కలిసి పనిచేయం తనకు ఇష్టం లేదని ఆమె స్పష్టం చేశారు. పురట్చి తమిళన్, కామ్రేడ్ సత్యరాజ్ కుమార్తెగా, ఒక తమిళ మహిళగా తమిళనాడు సంక్షేమం కోసం కృషి చేస్తానని ప్రకటించారు.



దివ్య సత్యరాజ్

పాఠశాలల మేనేజ్‌మెంట్ కమిటీ కాలపరిమితి పొడిగింపు

అడయార్, మార్చి 2: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు పెంచేందుకు, విద్యార్థుల సంఖ్య, హాజరు శాతం పెంచేందుకు, మౌలిక సదుపాయాల రూపకల్పనకు సూచనలు, సలహాలు ఇచ్చేందుకు వీలుగా ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యాశాఖ అధికారులతో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలను ఏర్పాటు చేశారు.. ఈ కమిటీల్లోని సభ్యుల కాలపరిమితి ఏప్రిల్, మే, జూలై నెలల్లో ముగియనుంది. ఈ నేపథ్యంలో ప్రాథమిక పాఠశాలల మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుల పదవీ కాలాన్ని ఆగస్టు 10వ తేదీ వరకు, ప్రాథమికోన్నత పాఠశాలల కమిటీ సభ్యులు కాలపరమితి జూలై 20వ తేదీ వరకు, హైస్కూల్, హయ్యర్ సెకండరీ పాఠశాలల కమిటీ సభ్యుల కాలపరిమితి ఆగస్టు 17వ తేదీ వరకు పొడగించారు. ఈ మేరకు గత నెల 29వ తేదీన ప్రభుత్వం జీవో జారీ చేసినట్టు ప్రభుత్వం శనివారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొంది.

విండ్‌మిల్లుకు వ్యతిరేకంగా అప్పియంపట్టిలో మహిళల ధర్నా

చెన్నై, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా ఒట్టన్‌సత్తిరం సమీపంలోని అప్పియంపట్టిలో ప్రైవేటు విండ్ మిల్లుకు నిరసనగా రైతు సంఘాల ఆధ్వర్యంలో మహిళల ధర్నా జరిగింది. ఆ విద్యుత్ కర్మాగారంలో ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌ను సరఫరా చేయడానికి ఆ గ్రామంలోని పంట పొలాలల్లో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులను వ్యతిరేకిస్తూ వారం రోజులుగా స్థానికులు, రైతు సంఘాల నాయకులు ఆందోళన చేస్తున్నారు. శనివారం ఉదయం పోలీసుల భద్రతతో ఆ విండ్‌మిల్లు యజమానులు పంట పొలాల్లో విద్యుత్ స్తంభాలు నాటేందుకు ప్రయత్నించడంతో మహిళలు అడ్డుకున్నారు. ఆందోళనలో పాల్గొన్న ఓ వృద్ధురాలు మూర్ఛిల్లడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆ తర్వాత పోలీసులు బలప్రయోగంతో ఆందోళన చేస్తున్న మహిళలందరినీ అరెస్టు చేశారు.



మూర్ఛిల్లిన వృద్ధురాలిని లేపుతున్న పోలీసులు

ట్రాఫిక్ పోలీసులకు ప్రత్యేక టోపీలు

ఐసిఎఫ్, మార్చి 2: ట్రాఫిక్ పోలీసులకు ఎండ తీవ్రత నుంచి ఉపశమనం కలిగించేందుకు కూలింగ్ గ్లాసులు, ప్రత్యేక టోపీలను ఆవడి పోలీస్ కమిషన్ శంకర్ అందజేశారు. అంబత్తూర్‌లో జరిగిన కార్యక్రమంలో ట్రాఫిక్ విభాగం పోలీసులకు మజ్జిగ ప్యాకెట్లు, చలువ కళ్లద్దాలు, చల్లదనం అందించే టోపీల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ శంకర్ మాట్లాడుతూ... పాఠశాల విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కావడంతో వారు ఆలస్యం లేకుండా పరీక్షలకు హాజరయ్యేలా ట్రాఫిక్ సమస్య పరిష్కరించాల్సి వస్తుందని, ఇందుకోసం ఉదయం నుంచే పర్యవేక్షణ పనులు ప్రారంభిస్తున్నామని తెలిపారు.



టోపీలు అందిస్తున్న కమిషనర్ శంకర్

రూ.67 కోట్లతో ఫ్లై ఓవర్

ఐసిఎఫ్, మార్చి 2: స్థానిక వళ్లువర్‌కోట్టంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించేలా రూ.67 కోట్లతో కొత్త ఫ్లై ఓవర్ నిర్మాణానికి చెన్నై కార్పొరేషన్ టెండర్లు కోరింది. నగరంలోని రద్దీ ప్రాంతాల్లో ఒకటైన వళ్లువర్‌కోట్టం జంక్షన్‌ను వేలాది వాహనాలు దాటి వెళ్తున్నాయి. ఇక్కడ ఫ్లై ఓవర్ నిర్మించనున్నట్లు అసెంబ్లీలో మంత్రి కేఎన్ నెహ్రూ ప్రకటించారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.195 కోట్ల కేటాయించగా, అందులో ఫ్లై ఓవర్ నిర్మాణ పనులకు రూ.67.16 కోట్లు, స్థల సేకరణకు రూ.113.19 కోట్లు కేటాయించారు. టెండర్లు పూర్తికాగానే పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

జాఫర్ సాధిక్ బ్యాంకు ఖాతాల స్తంభన

పెరంబూర్, మార్చి 2: మాదకద్రవ్యాల తరలింపు వ్యహారంలో, డీఎంకే మాజీ నాయకుడు జాఫర్ సాధిక్‌కు చెందిన 8 బ్యాంకు ఖాతాలు స్తంభింపజేశారు. ఢిల్లీలో బస చేసి, ఆహార పదార్థాలు తరలిస్తున్నట్లు విదేశాలకు మాదకద్రవ్య తయారీకి వినియోగించే 'సూడోఫ్రెడిన్' ముడిపదార్థం అక్రమ తరలింపు వ్యవహారంలో నగరానికి చెందిన ముఖేష్, ముజిబుర్ రెహ్మాన్, విల్లుపురానికి చెందిన అశోక్‌కుమార్ తదితరులను గత నెల 15వ తేది అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.75 కోట్ల విలువైన సూడోఫెడ్రిన్ స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంపై చేపట్టిన విచారణలో... మాదకద్రవ్యాల తరలింపు ముఠా నేతగా శాంథోమ్ అరుళానందం వీధికి చెందిన జాఫర్ సాధిక్ (36) వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. ఆయన డీఎంకేలో చెన్నై పశ్చిమ జిల్లా అనుబంధ సంఘ ఆర్గనైజర్‌గాను, సినీ నిర్మాతగా, హోటల్ యజమానిగా ఉన్నారు. ఢిల్లీలో ఉన్న కేంద్ర మాదకద్రవ్యాల తరలింపు నిరోధక విభాగం కార్యాలయానికి విచారణకు హాజరుకావాలని జాఫర్ సాధిక్ ఇంటికి సమన్లు అంటించారు. కానీ, సాధిక్ కుటుంబసభ్యులతో అజ్ఞాతంలోకి జారుకున్నారు. అతను విదేశాలకు వెళ్లడాన్ని అడ్డుకొనేలా లుకవుట్ నోటీసు జారీయైంది. ఈ నేపథ్యంలో, నగరంలోని సాధిక్ ఇంట్లో చేపట్టిన తనిఖీల్లో స్థలాలు కొనుగోలుకు సంబంధించిన పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే, సాధిక్‌కు సొంతమైన 8 బ్యాంక్ ఖాతాలు స్తంభింపజేసినట్లు మాదకద్రవ్యాల తరలింపు నిరోధక విభాగం పోలీసులు తెలిపారు.

వైభవంగా ఆనైకులత్తమ్మన్ రథోత్సవం

వేలూరు, మార్చి 2: స్థానిక వేలప్పాడి ఆనైకులత్తమ్మన్ రథోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా పడవేట్టుఅమ్మన్‌కు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని సుందరంగా అలంకరించి రథంపై ఆశీనులను చేయగా, వేలాది మంది భక్తులు రథం లాగారు. ఈ రథం శని, ఆదివారాల్లో వేలప్పాడిలో పలు వీధుల మీదుగా సాగుతూ భక్తులకు దర్శనమివ్వనుంది. ఈ సందర్భంగా రథంలోని పడవేట్టుఅమ్మన్‌కు కరెన్సీ మాలను అలంకరించారు.



వైద్య శిబిరానికి స్పందన

వేలూరు, మార్చి 2: ఏసీఎస్ వైద్యకళాశాల ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వళ్లలార్ పాఠశాలలో నిర్వహించిన శిబిరాన్ని పుదియ నీతి పార్టీ స్థాపకుడు ఏసీ షణ్ముగం ప్రారంభించారు. శిబిరంలో వైద్యపరీక్షలు నిర్వహించి సలహాలు అందజేశారు. అలాగే, అవసరమైన వారికి మందులు అందించారు.



శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

త్యాగరాజ భాగవతార్ జయంతి



వేలూరు, మార్చి 2: దివంగత సినీ నటుడు ఎంకే త్యాగరాజ భాగవతార్ 116వ జయంతి వేడుకలు శనివారం వేలూరు విశ్వకర్మ స్నేహితుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి సంఘ ఆర్గనైజర్ నటరాజన్ అధ్యక్షత వహించగా, ఉపాధ్యక్షుడు పన్నీర్‌సెల్వం ఆహ్వానించారు. సెక్రటరీ జనార్దనన్ సహా నిర్వాహకులు, సభ్యులు భాగవతార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా త్యాగరాజ భాగవతార్ స్మారక మందిరం ప్రారంభించిన ముఖ్యమంత్రి స్టాలిన్‌కు సమావేశంలో కృతజ్ఞతలు తెలుపుతూ తీర్మానం చేశారు. సంఘం నిర్వాహకులు పిచ్చాండి, నందకుమార్, గణేష్, జగదీశన్‌లు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ప్రేమించకుంటే యాసిడ్ పోస్తా

● పోక్సో చట్టం కింద ఇద్దరు యువకుల అరెస్ట్

పెరంబూర్, మార్చి 2: ప్రేమించకుంటే యాసిడ్ పోస్తానని బెదిరించిన కేసులో ఓ ప్రేమికుడు సహా ఇద్దర్ని పోలీసులు అరెస్ట్ చేశారు. కోయంబత్తూర్ జిల్లాకు చెందిన 14 ఏళ్ల బాలిక అదే ప్రాంతంలోని పాఠశాలలో టెన్త్ చదువుతోంది. ఈ బాలికకు కొద్ది నెలల క్రితం ఇన్‌స్టాగ్రాం ద్వారా అజారుద్దీన్ (19) పరిచయమయ్యాడు. వీరివురు సెల్‌ఫోన్‌లో తరచూ మాట్లాడుకునే వారు. ఈ నేపథ్యంలో, ఇంటి నుంచి డబ్బులు తీసుకురావాలని, సెల్‌ఫోన్ ద్వారా డబ్బులు పంపాలని అజారుద్దీన్ పలుమార్లు బెదిరిస్తుండడంతో, ఆ బాలిక అతనితో మాట్లాడడం తగ్గించింది. అయితే మళ్లీ ఫోన్ చేసిన అజారుద్దీన్... తాను ప్రేమిస్తున్నానని, ప్రేమించకుంటే యాసిడ్ పోస్తానని బాలికను బెదిరించినట్లు తెలిసింది. ఇందుకు అజారుద్దీన్ స్నేహితుడు ఆకాష్ (21) సహకరించాడు. ఈ నేపథ్యంలో, అజారుద్దీన్ వేధింపులు తట్టుకోలేని బాలిక జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పొల్లాచ్చి వెస్ట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై విచారించిన పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి అజారుద్దీన్, ఆకాష్‌ను అరెస్ట్ చేశారు.

25 ఏళ్లు దాటినా వివాహానికి నిరాకరణ

● తల్లిదండ్రులపై ఫిర్యాదు చేసిన యువకుడు

పెరంబూర్, మార్చి 2: వివాహం చేయని తల్లిదండ్రులపై ఓ యువకుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సేలం జిల్లా కన్నాంకుర్చి పోలీస్‌స్టేషన్‌లో అందిన ఫిర్యాదులో.. తనకు 25 ఏళ్లు పూర్తయ్యాయని, అయినా వివాహం చేసేందుకు తల్లిదండ్రులు నిరాకరిస్తున్నారని పేర్కొన్నాడు. ఊహించని ఫిర్యాదుకు దిగ్భ్రాంతి చెందిన పోలీసులు, యువకుడి తల్లిదండ్రులను పిలిపించి మాట్లాడారు. తమ కుమారుడు ఇప్పటివరకు ఎలాంటి పనికి వెళ్లడం లేదని, బైక్ కొనిస్తే మాత్రమే ఉద్యోగానికి వెళ్తానని చెప్పడంతో కొనిచ్చామని, అయినా పనికి వెళ్లకుండా తిరుగుతున్నాడన్నారు. ఈక్రమంలో, అతనికి ఎలా పెళ్లి చేస్తామని తల్లిదండ్రులు తమ బాధను పోలీసులకు వివరించారు. దీంతో, ముందు ఉద్యోగానికి వెళ్లాలని, అలాగే మంచి యువకుడిగా పేరుపొందిన తర్వాత తల్లిదండ్రులకు వివాహం చేస్తారని పోలీసులు ఆ యువకుడికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు.

ప్రైవేటు బస్సు బోల్తా : 26 మందికి గాయాలు

చెన్నై, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా మేలూరు వద్ద శనివారం వేకువజామున జరిగిన బస్సు ప్రమాదంలో 26 మంది గాయపడ్డారు. తిరునల్వేలి జిల్లా పులియంగుడికి చెందిన 42 మహిళలు సహా 50 మందితో ప్రైవేటు బస్సు మేల్‌మరువత్తూరు ఆదిపరాశక్తి సిద్ధర్‌పీఠానికి బయలుదేరింది. ఆధ్యాత్మిక గురువు బంగారు అడిగళార్ అవతార దినోత్సవంలో పాల్గొనేందుకు వీరంతా బయలుదేరారు. ఆ బస్సు మదురై జిల్లా మేలూరు సమీపం కొట్టాంపట్టి వద్దనున్న ఫోర్‌వే రహదారిలో వెళుతుండగా అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న గోతిలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 26 మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని అంబులెన్సుల ద్వారా చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు. వీరిలో ఆరుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం మదురై ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కొట్టాంపట్టి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.



కారులో రూ.17 లక్షల చోరీ

● ఆరుగురి అరెస్టు

అడయార్, మార్చి 2: తంజావూరు జిల్లా తిరువిడైమరుదూరు తాలూకా గోవిందపురం గ్రామానికి చెందిన చంద్రశేఖరన్ కారులో ఉంచిన రూ.17 లక్షలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. దీనిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి ఈ చోరీకి పాల్పడిన ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. చంద్రశేఖర్ తన కంపెనీకి వచ్చిన చెక్కులను బ్యాంకులో మార్చుకుని, తిరిగి కారులో వస్తూ కుంభకోణం కామాక్షి జోషియర్ వీధిలో పార్కింగ్ చేశాడు. తన పనులను పూర్తి చేసుకుని తిరిగి ఇంటికి చేరుకునేందుకు కారు వద్దకు రాగా, కారులోని డబ్బులు కనిపించలేదు. దీంతో చంద్రశేఖర్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ విచారణలో సెంథిల్ కుమార్, చెన్నై కోట్టూరుపురానికి చెందిన సురేష్, సెల్వగణపతి, శశికుమార్, వాలాజాబాద్‌కు చెందిన విశ్వ, శాంతకుమార్ చోరీకి పాల్పడినట్టుగా గుర్తించి, అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.7.72 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుట్కా విక్రయించిన దుకాణాల సీజ్

అడయార్, మార్చి 2: స్థానిక అరుంబాక్కంలో ప్రభుత్వం నిషేధించిన గుట్కాతో పాటు పొగాకు ఉత్పత్తులను విక్రయించిన రెండు కిరాణా షాపులను పోలీసులు సీజ్ చేశారు. ఈ ప్రాంతంలోని కిరాణా షాపులు, బడ్డీ కొట్టుల్లో గుట్కా విక్రయాలు జోరుగా సాగుతున్నట్టు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు జెపరాజ్ నేతృత్వంలో ప్రత్యేక బృందం అధికారులు ఆ ప్రాంతంలోని దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా, రెండు దుకాణాల్లో నిషేధిత 500 గ్రాముల గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. గతంలో ఈ దుకాణాల్లో గుట్కా ప్యాకెట్లు విక్రయిస్తున్నట్టు గుర్తించి అపరాధం విధించారు. ఇపుడు మళ్లీ ఈ నిషేధిత పొగాకు ఉత్పత్తులు విక్రయించడంతో సీజ్ చేశారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.


విద్యార్థినిపై కత్తితో దాడి

● యువకుడికి యావజ్జీవం

పెరంబూర్, మార్చి 2: కళాశాల ప్రవేశద్వారం సమీపంలో విద్యార్థినిపై దాడి చేసిన యువకుడికి యావజ్జీవశిక్ష విధిస్తూ చెన్నై మహిళా ప్రత్యేక కోర్టు తీర్పు వెలువరించింది. స్థానిక మదురవాయల్‌కు చెందిన అశ్విని, కేకేనగర్‌లోని మీనాక్షి కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. ఈ నేపథ్యంలో, అదే ప్రాంతానికి చెందిన అళగేశన్, రోజూ అశ్విని కళాశాలకు వెళ్లే సమయంలో వెంట పడి ప్రేమిస్తున్నానంటూ వేధించసాగాడు. అతని వేధింపులు భరించలేని అశ్విని ఫిర్యాదుతో అళగేశన్‌ను పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. బెయిలుపై విడుదలైన అళగేశన్ 2018 మార్చిలో కళాశాల ప్రవేశద్వారం సమీపంలో అశ్వినిపై కత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను చుట్టుపక్కల వారు ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్సలు ఫలించక మృతిచెందింది. ఈ ఘటనపై కేకే నగర్ పోలీసులు కేసు నమోదు చేయగా, అల్లికుళంలోని మహిళా ప్రత్యేక కోర్టులో కేసు విచారణ సాగుతోంది. ఈ కేసులో అళగేశన్‌పై నేరారోపణలు రుజువు కావడంతో అతనికి యావజ్జీవ జైలు, రూ.10,500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి టీహెచ్ మహ్మద్ ఫారూఖ్ శుక్రవారం తీర్పు వెలువరించారు. అలాగే, మృతురాలి కుటుంబానికి తగిన పరిహారం అందించే చర్యలు చేపట్టాలని చెన్నై జిల్లా న్యాయ సలహాల కమిషన్ బృందానికి న్యాయమూర్తి సిఫారసు చేశారు.

మైనింగ్ శాఖలో 'మేక్ ఇన్ ఇండియా'కు ప్రోత్సాహం

అడయార్, మార్చి 2: మైనింగ్ శాఖలో మేక్ ఇన్ ఇండియా ఉత్పత్తులకు అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు కేంద్ర బొగ్గు, గనుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి అమృత్‌లాల్ మీనా వెల్లడించారు. శనివారం నగరంలో మైనింగ్ మెషనరీస్ కోసం మేక్ ఇన్ ఇండియా కార్యక్రమంలో స్టేక్ హోల్డర్స్ మీట్ జరిగింది. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న అమృత్ లాల్ మీనా మాట్లాడుతూ, మైనింగ్ శాఖలో భూగర్భ గనుల యంత్రాల తయారీ, ఎర్త్ మూవర్స్ యంత్రాల తయారీలో దేశీయంగానే కాకుండా అంతర్జాతీయంగా కూడా ప్రాముఖ్యం ఉందన్నారు. మేక్ ఇన్ ఇండియా అనేది దేశీయంగా తయారు చేసిన ఉత్పత్తులకు ప్రాచుర్యం కల్పించడంతో పాటు తయారీకి, దానికి అవసరమైన నిధులను సమీకరించడానికి, ప్రోత్సహించడానికి కంపెనీల ఏర్పాటుకు ఆసక్తి చూపే వారిని ప్రోత్సహించే కార్యక్రమమన్నారు. పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడం, ఆధునిక, సమర్థవంతమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, విదేశీ పెట్టుబడుల కోసం కొత్త రంగాలను ప్రోత్సహించేందుకు ప్రాధాన్యం కల్పిస్తారన్నారు.





చెన్నైలో జరిగిన ఎస్‌వీసీఈ ట్రోఫీ విజేతలుగా నిలిచిన సెయింట్ జోసెఫ్ ఇంజనీరింగ్ కాలేజీకి చెందిన బాలురు, బాలికల జట్లు


సముద్రంలో చమురును వెలికితీసే కేంద్రం


కన్నియాకుమారి తీరం


పుదుచ్చేరి బీచ్

SUNDAY SPECIAL

కడలి తల్లి గుండెల్లో గునపాలు

జాలర్ల మనుగడకు ముప్పు


ఎడారిగా మారనున్న బీచ్‌లు

నెడువాసల్ 2.0 తప్పదా?

రాష్ట్రంలో కడలి తల్లి గుండెల్లో గునపాలు దించి చమురును వెలికితీసేందుకు జరుగుతున్న ప్రయత్నాలతో పర్యాటక ప్రాంతాలుగా పేరుగడించిన సముద్రతీరాలు కనుమరుగవుతాయా? మన్నార్ జలసంధి వద్ద సముద్ర నిక్షేపాలు మాయమవుతాయా? కాశిమేడు తీరం చమురు తెట్టుతో పేరుకుపోతుందా? కన్నియాకుమారి త్రివేణి సంగమం తన అందాలను కోల్పోనుందా? రాష్ట్రంలోని బీచ్‌లన్నీ ఎడారి ప్రాంతాలుగా మారుతాయా? ఈ ప్రశ్నలకు పర్యావరణ ప్రేమికులు అవుననే సమాధానం చెబుతున్నారు. చమురు అన్వేషణలకు సంబంధించి కేంద్రప్రభుత్వం ఇటీవల జారీ చేసిన ప్రకటన రాష్ట్రంలోని 32,485 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం కలిగిన సముద్రతీరానికి పెను ముప్పు సంభవించనుందని, కడలితల్లిని నమ్ముకున్న జాలర్ల జీవనానికి అపారనష్టం కలిగించనుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదే జరిగితే రాష్ట్రంలో నెడువాసల్ 2.0 ఉద్యమం తప్పదని కూడా చెబుతున్నారు.

\- చెన్నై, ఆంధ్రజ్యోతి


కడలూరు సిల్వర్ బీచ్


కాశీమేడు తీరం

ఏమిటీ నెడువాసల్ ఉద్యమం...


మన్నార్ జలసంధి

కొన్నేళ్లకు ముందు పుదుకోట జిల్లా కావేరి బేసిన్‌లోని నెడువాసల్‌లో కేంద్ర ప్రభుత్వం హైడ్రోకార్బన్ పథకం కోసం తవ్విన చమురుబావులను మూసివేయాలని రైతులు ఆందోళన చేయడం, అది కాస్తా తీవ్ర ఉద్యమంగా మారడంతో ఆ బావులను మూసివేసి చమురు తవ్వకాల ప్రాజెక్టులకు ఫుల్‌స్టాప్ పెట్టారు. అప్పటి నుంచి కేంద్రప్రభుత్వం రాష్ట్రంలో ఎలాగైనా చమురుతవ్వకాలను మళ్లీ ప్రారంభించాలని ప్రయత్నాలు చేపట్టింది. ఆ తవ్వకాలను భూమిపై కాకుండా కడలిలో చేపడితే ఎవరూ నిరసనలు ప్రకటించరని భావించింది. అనుకున్నదే తడవుగా ఆ దిశగా అడుగులు వేస్తోంది. కావేరి బేసిన్ సమీపంలోని సముద్రతీరం సహా రాష్ట్రంలో మరి కొన్ని సముద్ర తీర ప్రాంతాల్లో హైడ్రోకార్బన్ అన్వేషణ తవ్వకాలను నిర్వహించడానికి గత జనవరి 3న అంతర్జాతీస్థాయి వేలంను ప్రకటించి, చమురు తవ్వకాల్లో ప్రైవేటు సంస్థలకు భాగస్వామ్యానికి శ్రీకారం చుట్టింది.

జాలర్లు పట్టించుకోరని...

ఈ విషయమై 'భూ ఉలగిన్ నన్బర్‌గళ్' (భూలోక మిత్రులు) సంస్థ నిర్వాహకుడు వెత్రి సెల్వన్ మాట్లాడుతూ... 2014లో ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి హైడ్రోకార్బన్ అన్వేషణ, చమురు తవ్వకాలకు ప్రైవేటు సంస్థలకు లైసెన్స్ జారీ చేయడానికి రెండు రకాలైన చట్టాలను రూపొందించారని చెప్పారు. రాష్ట్రంలో కావేరి బేసిన్ సమీపంలోని నెడువాసల్ వద్ద తవ్విన చమురుబావులకు వ్యతిరేకంగా తీవ్రస్థాయిలో ఆందోళన జరగడంతో వాటిని మూసివేశారని చెప్పారు. నెడువాసల్ ఉద్యమం జరిగినప్పుడు తీరం సహా సముద్రంలో చమురు తవ్వకాలకు సంబంధించిన ప్రాజెక్టులను కేంద్రం సిద్ధం చేసిందని, అయితే నెడువాసల్ ఉద్యమం తీవ్ర రూపం దాల్చడంతో తాత్కాలికంగా వెనకడుగు వేసిందిన్నారు. ప్రస్తుతం పరిస్థితులు తమకు అనుకూలంగా ఉండడంతో కేంద్రం ఆ ప్రాజెక్టు ఫైళ్ల దుమ్ము దులిపిందన్నారు. సముద్రంలో చమురు తవ్వకాలు జరిపితే తీర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు, ప్రత్యేకించి కడలితల్లినే నమ్ముకున్న జాలర్లు పట్టించుకోరని కేంద్రం అపోహపడుతోందన్నారు. ఇలా పర్యావరణానికి ముప్పు కలిగించే ఇలాంటి పథకాల అమలుకు పర్యావరణ శాఖ అనుమతి తీసుకోవాలని, ప్రజాభిప్రాయ సేకరణ జరపాల్సి ఉందన్నారు. సముద్రగర్భంలో చమురు తవ్వకాలు జరపటం వల్ల ప్రజల నుండి ఎలాంటి నిరసనలు రావని భావించే కావేరి బేసిన్ కడలితీరాన్ని పూర్తిగా ప్రైవేటు సంస్థలకు ధారాదత్తం చేయాలని కేంద్రప్రభుత్వం భావిస్తోందని వెత్రి సెల్వన్ చెప్పారు.

జాలర్ల జీవనానికే ముప్పు...

కడలిలో చమురు తవ్వకాలు చేపడితే జాలర్ల జీవనానికే పెనుముప్పు వాటిల్లుతుందని, సముద్రంలో చేపల సంపద తరలిపోయే ప్రమాదం ఉందని పర్యావరణ ప్రేమికులు చెబుతున్నారు. సముద్రంలో చమురు తవ్వకాలకు జాలర్ల నుంచి ఎలాంటి అభిప్రాయ సేకరణ అనవసరమని కేంద్రం భావిస్తోందని చెప్పారు. చమురు తవ్వకాలు జాలర్లకే కాకుండా నూనె తెట్టు వంటి పెనుమార్పులు వల్ల మానవాళి మనుగడకే ముప్పు ఖాయమని ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వం తీవ్ర నిరసనలు ప్రకటిస్తుందని, జాలర్ల సంఘాల నాయకులు కేంద్ర ప్రభుత్వం కడలిలో చమురు తవ్వకాలకు జరపకుండా ఉద్యమాలు నిర్వహించడం ఖాయమని పేర్కొంటున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో నాలుగు ప్రాంతాల్లో సముద్రంలో చమురుతవ్వకాలు జరపాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని, ఆ మేరకే ప్రైవేటు సంస్థల తవ్వకాలకు వేలం ద్వారా అనుమతిని జారీ చేసిందని చెబుతున్నారు.

చెన్నైకి తప్పని ముప్పు...

కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన నాలుగు ప్రాంతాల్లో చెన్నై నగరంలోని సముద్రతీరం కూడా ఉంది. చెన్నైకి చేరువగా ఆంధ్రప్రదేశ్ కడలి తీరం నుంచి పుదుచ్చేరి, మరక్కాణం, విల్లుపురం, కడలూరు దాకా విస్తరించి ఉన్న సముద్రంలో చమురు తవ్వకాలు చేపడతారు. అదే జరిగితే రాజధాని నగరం చెన్నై తీరం పర్యాటక శోభను కోల్పోవడం ఖాయమని, తరచూ నూనె తెట్టుతో తీరం కాస్తా భయానకంగా మారుతుందని పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విధంగా నగరంలోని కాశిమేడు తీరం, బిసెంట్‌నగర్ బీచ్, ఎలియట్స్ బీచ్ సహా అన్ని బీచ్‌లు నిర్మానుష్యంగా మారుతాయని చెబుతున్నారు. ఇక కన్నియాకుమారి సముద్రతీరం పొడవునా మూడు చోట్ల చమురు తవ్వకాలు జరుగుతాయని, ఆ పనుల కారణంగా ప్రపంచ పర్యాటక చిత్రపటంలో కన్నియాకుమారి త్వరలో తన ఉనికి కోల్పోవడం ఖాయమంటున్నారు. కేంద్ర నిర్వహించిన వేలంలో రాష్ట్రంలో 32,485 చదురపు కిలోమీటర్ల విస్తీర్ణం కలిగిన సముద్ర ప్రాంతాన్ని చమురు తవ్వకాలకు ఎంపిక చేశారు. నెడువాసల్ ఉద్యమం జరిగినప్పుడే రాష్ట్ర ప్రభుత్వం కావేరి డెల్టా ప్రాంతాన్ని సురక్షిత వ్యవసాయ మండలిగా ప్రకటించింది. ఈ నిర్ణయాన్ని గ్రీన్ ట్రిబ్యూనల్ ఆమోదించింది. ఈ నేపథ్యంలో గత యేడాది కేంద్ర ప్రభుత్వం కావేరి బేసిన్‌ను మినహాయించి ఈ చమురు తవ్వకాల ప్రాజెక్టులను అమలు చేయాలని ప్రయత్నించింది. అయితే ముఖ్యమంత్రి స్టాలిన్ కావేరి బేసిన్ ప్రాంతాలే కాకుండా ఏ ప్రాంతంలోనైనా కేంద్రప్రభుత్వం హైడ్రోకార్బన్ తవ్వకాలు చేపడితే రాష్ట్రప్రభుత్వం వ్యతిరేకిస్తుందని ప్రధాన మోదీకి సుదీర్ఘ లేఖ రాశారు. ఈ పరిస్థితుల్లో భూమిని విడిచిపెట్టిన కేంద్ర ం కడలి తల్లికి చమురుతవ్వకాల యంత్రాలతో తూట్లు పొడవాలని కంకణం కట్టుకుందని పర్యావరణ ప్రేమికులు చెబుతున్నారు. ఈ హైడ్రోకార్బన్ తవ్వకాలకు సంబంధించిన నాలుగు జోన్లలో మూడు జోన్లు కన్నియాకుమారి, మన్నార్ జలసంధి ప్రాంతాల్లోనే ఉన్నాయి. మన్నార్ జలసంధి ప్రాంతం వద్దే సముద్ర జలసంపద అత్యధికంగా ఉంటోంది. మేలిమి ముత్యాలు, పగడ రాళ్లు మాత్రమే కాకుండా చేపల సంపద పుష్కలంగా లభించేదీ ఈ ప్రాంతాల్లోనే. ఈ సముద్రతీర ప్రాంతాలను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని పర్యావరణ ప్రేమికులు చెబుతున్నారు. భూముల్లో చమురు తవ్వకాలు చేపడితే రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తారని, అయితే సముద్రంలో తవ్వకాలు జరిపితే కడలి పుత్రులైన జాలర్లు మిన్నకుండి పోతారని కేంద్రం తప్పుడు అంచనాలో ఉందని భూ ఉలగిన్ నన్బర్‌గళ్ సంస్థ నిర్వాహకుడు ప్రభాకరన్ చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, జాలర్ల సంఘాల నాయకులు కలిసికట్టుగా కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న హైడ్రోకార్బన్ తవ్వకాలను ప్రాథమిక స్థాయిలోనే అడ్డుకోవాలని లేకుంటే కడలితీరం అంతా నెడువాసల్ 2.0గా మారే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరిస్తున్నారు.

తమిళ సినిమా

ట్రేడ్ గైడ్ ఆవిష్కరణ


తమిళ సినిమా ట్రేడ్ గైడ్ ఆవిష్కరణ దృశ్యం

తమిళనాడు ఫిల్మ్ యాక్టివ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ (టీఎఫ్ఏపీఏ) తమిళ సినిమా ట్రేడ్ గైడ్‌ను రూపొందించగా దాన్ని దర్శక దిగ్గజం భారతీరాజా ఆవిష్కరించారు. ఒక ప్రాంతీయ భాషలో ఈ తరహా గైడ్‌ను ముద్రించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఇది నిర్మాతలు తమ చిత్రాలను విక్రయించడానికి, సరైన వ్యక్తులకు సంప్రదించడానికి, మూవీ హక్కులను కొనుగోలుదారుల నుంచి తెలుసుకోవడానికి దోహదపడుతుంది. ఈ గైడ్‌ను మాస పత్రికగా ముద్రించనున్నారు. తమిళ సినిమా బిజినెస్ గైడ్ రాష్ట్ర వ్యాప్త సినిమా పంపిణీదారులు, హిందీ డబ్బింగ్ హక్కుల కొనుగోలుదారులు, ఇతర భాష (తెలుగు) హక్కుల కొనుగోలుదారులు, దక్షిణ భారత ఉపగ్రహ చానెళ్లు, డిజిటల్, ఓటీటీ ప్లాట్‌ఫారమ్స్, విదేశీ హక్కుల కొనుగోలుదారులు, ఆడియో, మ్యూజిక్ కంపెనీల వివరాలను పొందుపరచనున్నారు. ఈ గైడ్‌ను బయ్యర్లతో పాటు ప్రొడక్షన్ కంపెనీలకు ఉచితంగా పంపిణీ చేయనున్నారు. ఈ గైడ్ ఆవిష్కరణ కార్యక్రమంలో ధనుంజయన్, త్యాగరాజన్, సురేష్ కామాక్షి, ఎస్ఆర్. ప్రభు, అమ్మ రాజశేఖర్, ఆర్. కన్నన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి ప్రచారం చేయడం లేదు

చిత్రజ్యోతి

● నటుడు పార్తిబన్


ప్రారంభోత్సవంలో నక్కీరన్ గోపాల్, పార్తిబన్

ఇప్పుడు ఏ రెస్టారెంట్‌కు వెళ్లినా కాఫీ నురగపై తామర పువ్వులాంటి డిజైన్ వేసి కస్టమర్లకు సర్వ్ చేయడం సర్వసాధారణంగా మారిందని, ఇపుడు తాను బీజేపీకి ప్రచారం చేయడం లేదని నటుడు పార్తిబన్ అన్నారు. అన్నానగర్‌లో 'ఇచ్చాస్' పేరుతో నెలకొల్పిన రెస్టారెంట్‌ను ప్రముఖ పత్రిక ఎడిటర్ 'నక్కీరన్' గోపాల్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఆ తర్వాత పార్తిబన్ మాట్లాడుతూ... 'ఈ రెస్టారెంట్ నిర్వాహకులు ఇచ్చిన కాఫీపై తామర పువ్వు డిజైన్ చేసి ఇచ్చారు. ఇక్కడే కాదు ఏ రెస్టారెంట్‌కు వెళ్ళిన ఇదేవిధంగా ఇస్తున్నారు. ఈ విషయం చెప్పడం ద్వారా నేను బీజేపీకి ప్రచారం చేస్తున్నానని భావించవద్దు. ఇలాంటి చిన్నచిన్న విషయాలను కూడా ప్రజలు బాగా ఎంజాయ్ చేస్తున్నారు. సాధారణంగా ఈ ప్రపంచం ప్రారంభమైనప్పటి నుంచి జనాభా పెరుగుదలకు మొదటి రాత్రి (ఫస్ట్‌నైట్) కారణంగా ఉంది. ఈ రెస్టారెంట్ ప్రారంభోత్సం తొలి రోజునే ఇంత ఘనంగా జరుపుకోవడం చాలా సంతోషంగా ఉంది. ఖర్చుకు ఏమాత్రం వెనుకాడకుండా, నాణ్యవంతమైన, రుచికరమైన ఆహార పదార్థాలను ప్రజలు ఇష్టపడుతున్నారు. అందువల్ల క్వాలిటీ, టేస్ట్‌లో ఏమాత్రం రాజీ పడొదని నిర్వాహకులను కోరుతున్నాను' అని పేర్కొన్నారు. నక్కీరన్ గోపాల్ మాట్లాడుతూ, 'ఇలాంటి రెస్టారెంట్లు మరిన్నింటిని ప్రారంభించాలని యజమాని గణేష్‌ను కోరుతూ ఆయనకు అభినందనలు తెలుపుతున్నాను' అని పేర్కొన్నారు.

15న 'యావరుం వల్లవరే' విడుదల


'యావరుం వల్లవరే'లో సముద్రగని తదితరులు

సముద్రఖని, యోగిబాబులు ప్రధాన పాత్రల్లో రాజేంద్ర చక్రవర్తి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'యావరుం వల్లవరే'. ఈ నెల 15న విడుదలకు సిద్ధమైంది. ప్రేమ నిజ జీవితంలోనే కాదు సినిమాల్లో కూడా విఫలం కాలేదు. అలాంటి ప్రేమను నేపథ్యంగా చేసుకుని హైపర్‌లింక్ స్టోరీగా ఈ చిత్రం తెరకెక్కింది. ఈ సినిమా గురించి దర్శకుడు రాజేంద్ర చక్రవర్తి మాట్లాడుతూ... 35 రోజుల పాటు తిరుచ్చి, తొళుదూర్, పెరంబలూరు, దిట్టకుడి, ఉళుందూరుపేట, చెన్నై, పెరియకుళం, వడమదురై, తిరువేర్కాడు తదితర ప్రాంతాల్లో చిత్రీకరించాం. ఈ మూవీ అన్ని వర్గాల ప్రేక్షకులు చూసి ఎంజాయ్ చేసేలా ఉంటుంది. ప్రతి ఒక్కరి మనసుల్లో ప్రేమ, రాగద్వేషాలు ఉంటాయి. కానీ, ప్రేమను పోగొట్టుకున్నట్టుగా భావించి, దాని కోసం ఎదురు చూస్తుంటాం. ఆ ప్రేమను తిరిగి పొందే ప్రయత్నమే ఈ చిత్రం' కుటుంబ ప్రేక్షకులు హాస్యాన్ని, యువత లవ్‌ను, వృద్ధులు ప్రేమను ఇష్టపడుతారు. ఈ మూడు అంశాలు ఉన్న చిత్రమే ఇది' అని పేర్కొన్నారు.

ధీరజ్ 'డబుల్ టక్కర్' షూటింగ్ పూర్తి



'డబుల్ టక్కర్' చిత్ర బృందం

ధీరజ్, స్మృతి వెంకట్ జంటగా, కోవై సరళ, ఎంఎస్ భాస్కర్ తదితరులు ఇతర పాత్రలను పోసించిన 'డబుల్ టక్కర్' చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుంది. దేశంలోనే తొలిసారి యానిమేషన్ పాత్రలతో కలిసి ఈ చిత్రాన్ని రూపొందించారు. మీరా మహతి దర్శకత్వం వహించారు. ఎయిర్ ఫ్లిక్ సంస్థ నిర్మించిన ఈ చిత్రానికి విద్యాసాగర్ సంగీతం అందించారు. గత నెలలో ఆడియో ట్రైలర్‌ను రిలీజ్ చేయగా, ఇపుడు చిత్ర నిర్మాణం పూర్తి చేసుకున్నట్టు నిర్మాణ సంస్థ అధికారికంగా తెలిపింది. కాగా, ఈ సినిమా గురించి దర్శకుడు మాట్లాడుతూ... 'ఎవరివద్ద సహాయక దర్శకుడుగా పనిచేయకుండా, షార్ట్ ఫిలిమ్స్‌కు దర్శకత్వం వహించిన అనుభవంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించా. కొందరు వర్ధమాన హీరోలకు స్టోరీ చెప్పేందుకు ప్రయత్నించా. కేవలం ఐదు నిమిషాల సమయం కేటాయించాలని కోరాను. కానీ ఏ ఒక్కరూ సమయం ఇవ్వలేదు. ఆ సమయంలో నటుడు షైమ్ గోపి.. హీరో ధీరజ్‌ను పరిచయం చేశారు. ఐదు నిమిషాల్లో ఇంప్రెస్ చేయాలని కథ చెప్పడం ప్రారంభిస్తే గంట సమయం పట్టింది. కథ విన్న తర్వాత సూపర్‌గా వర్కౌట్ అవుతుందని చెప్పడంతో ఈ మూవీ కార్యరూపం దాల్చింది. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం' అని పేర్కొన్నారు.

రోబోటిక్ సర్జరీతో వృద్ధుడి కిడ్నీలో కణితి తొలగింపు


డాక్టర్ వసంతరాజ రామసామి

చెన్నై, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయి యూరో క్లినిక్‌లో 71 యేళ్ల వృద్ధుడి కుడివైపు మూత్రాశయంలో 3.5 సెం.మీ.ల కణితిని రోబోటిక్ సర్జరీతో తొలగించినట్లు ఆ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వసంతరాజ రామసామి తెలిపారు. మధుమేహ సమస్యలతో బాధపడుతూ తమ ఆసుపత్రిలో చేరిన ఆ వృద్ధుడికి తగు వైద్యపరీక్షలు నిర్వహించి తన నాయకత్వంలో రోబోటిక్ సర్జెన్ పి.ఆరతి తదితర వైద్యుల బృందం శస్త్రచికిత్సను నిర్వహించి కిడ్నీలో ఉన్న కణితిని తొలగించినట్లు చెప్పారు. రెండు రోజుల తర్వాత ఆ వృద్ధుడు సంపూర్ణంగా కోలుకుని డిశ్చార్జి అయినట్లు ఆయన తెలిపారు. ఈ రోబోటిక్ సర్జరీ వల్ల రక్తస్రావం బాగా తగ్గించగలిగామని, మూత్రాశయాలు పనితీరుకు ఆటంకం కలిగించకుండా విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించామని వివరించారు.

మోదీ బెదిరింపులకు భయపడం

● మంత్రి అన్బిల్ మహేష్

పెరంబూర్, మార్చి 2: మోదీ బెదిరిస్తే భయపడేందుకు తాము అన్నాడీఎంకే కాదని పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ అన్నారు. తిరుచ్చి జిల్లా మనప్పారైలో కలైంజర్ విగ్రహావిష్కరణ శుక్రవారం రాత్రి జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ... తుఫాను, వరదలు సంభవించిన సమయం, జాలర్లు మృతి చెందిన రోజు, నీట్ వ్యవహారంలో 22 మంది విద్యార్థినీ, విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడిన సమయంలో రాని మోదీ, ప్రస్తుతం తరచూ రాష్ట్రానికి రావడంలో అర్థం ఏంటని ప్రశ్నించారు. అందుకు ఎన్నికలు వస్తున్నాయనేది సమాధానం అన్నారు. రాష్ట్రంలో డీఎంకే నాశనం చేస్తాం, వెళ్లగొడతామని మోదీ పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అన్నా రూపొందించిన తమిళనాడులో మోదీ బెదిరింపులు పనిచేయవని

మేల్‌మరువత్తూరులో వైభవంగా అడిగళార్ అవతారదినం


శనివారం ఉదయం జరిగిన స్వర్ణరథోత్సవం

చెన్నై, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మేల్‌మరువత్తూరు ఆదిపరాశక్తి సిద్ధర్ పీఠంలో శనివారం ఉదయం ఆధ్యాత్మిక గురువు బంగారు అడిగళార్ 83వ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. అడిగళార్ అవతార దినోత్సవాలు ఈ పీఠంలో శుక్రవారం ఉదయమే ప్రారంభమయ్యాయి. ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, ఆరాధనలు జరిపారు. ఈ కార్యక్రమాలకు ఆదిపరాశక్తి ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ నాయకత్వం వహించారు. ఆధ్యాత్మిక ఉద్యం ఉపాధ్యక్షుడు సెందిల్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం కలశ జ్యోతి పూజలు జరిగాయి. ఇక శనివారం ఉదయం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, ఆరాధన కార్యక్రమాలు ఆధ్యాత్మిక ఉద్యం ఉపాధ్యక్షుడు పి. అన్బళగన్ ప్రారంభించారు. ఉదయం 10 గంటలకు అడిగళార్ విగ్రహ స్వర్ణరథోత్సవం నిర్వహించారు. వేలాదిమంది భక్తులు ఈ రథోత్సవంలో పాల్గొన్నారు. ఉదయం 10.50 గంటలకు భక్తులు అడిగళార్ చిత్రపటం వద్ద పాదపూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న భక్తులందరికీ భోజన సదుపాయం కూడా కల్పించారు. ఇదే విధంగా సిద్ధర్‌పీఠంలో ఆదివారం అడిగళార్ జయంతి వేడుకల సందర్భంగా పలు సామాజిక సేవా కార్యక్రమాలను భారీ ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ వేడుకల్లో రాష్ట్ర మంత్రులు దురైమురుగన్, దామో అన్బరసన్, ఎంపీ జగద్రక్షగన్ పాల్గొని బలహీనవర్గాలకు చెందిన ప్రజలకు రూ.3 కోట్ల విలువైన సహాయాలను పంపిణీ చేయనున్నారు.

'అగర్వాల్'లో ఉచిత కంటి పరీక్షలు



చెన్నై, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నగరంలోని డాక్టర్ అగర్వాల్ నేత్ర వైద్యశాలల్లో మహిళలకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆ ఆసుపత్రి క్లినికల్ సర్వీసెస్ రీజినల్ హెడ్ డాక్టర్ ఎస్.సౌందరి తెలిపారు. 18 యేళ్లకు పైబడిన మహిళలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు. ఈనెల 15 వరకు నిర్వహించే ఈ ఉచిత నేత్రపరీక్షలకు 95949 24048 అనే నెంబర్‌కు ఫోన్ చేసి ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు.

అంబానీకి మోదీ ప్రభుత్వం భారీ చదివింపు!

● సీపీఎం ఎంపీ వెంకటేశన్ విమర్శ

పెరంబూర్, మార్చి 2: మదురైకి అంతర్జాతీయ విమాన హోదా కల్పించాలని కొన్నేళ్లుగా కోరుతున్నా ఫలితం లేకపోయిందని మదురై సీపీఎం ఎంపీ వెంకటేశన్ ఆవేదన వ్యక్తం చేశారు. పారిశ్రామికవేత్త ముఖేష్ అంబాని కుమారుడి వివాహం ఈ నెల 1 నుంచి 3వ తేది వరకు గుజరాత్ రాష్ట్రం జామ్‌నగర్‌లో జరగనుంది. ఈ వేడుకలకు దేశ, విదేశాలకు చెందిన ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు హాజరుకానున్నారు. ప్రముఖుల సౌకర్యార్థం జాతీయ స్థాయి హోదా కలిగిన జామ్‌నగర్ విమానాశ్రయాన్ని ఈ నెల 5వ తేది వరకు అంతర్జాతీయ హోదా కల్పిస్తూ మోదీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ విషయమై ఎంపీ వెంకటేశన్ తన ఎక్స్‌లో... ముఖేష్ అంబాని కుమారుడు వివాహ గిఫ్ట్‌గా జామ్‌నగర్ విమానాశ్రయాన్ని 10 రోజులు ప్రత్యేక అంతర్జాతీయ హోదా కల్పించారు. 6 విమానాలు ల్యాండయ్యే స్థలంలో 140 విమానాలకు అనుమతి. కానీ, మదురై విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదా కల్పించాలని ఏళ్లుగా కోరుతున్నా ఫలితం లేదు. పైగా తమిళనాడుకు ఎందుకు 4వ అంతర్జాయ విమానాశ్రయం అనే ప్రశ్న వేస్తున్నారంటూ ఎంపీ ట్వీట్ చేశారు.